సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



తిరుగు ప్రయాణం పాట్లు
పండుగల సీజన్‌లో సొంతూరుకు వచ్చి హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు జిల్లావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
8లో



రూ.20 వేలు ఇస్తేనే..
రూ.20 వేలు తీసుకొస్తేనే ఆపరేషన్ చేస్తా నన్న ఓ వైద్యుడి నిర్వాకం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆలస్యంగా వెలుగుచూసింది.
8లో



ముగిసిన కబడ్డీ పోటీలు
నూజివీడులో మూడు రోజులుగా జరుగు తున్న 72వ అఖలభారత పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు ముగిశాయి.
8లో

సర్కారీ సిండికేట్ మాయ

షాపులెవరివైనా.. వారిదే హవా

- 175 షాపులకు 5,627 దరఖాస్తులు
- లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు
- ముగిసిన ప్రక్రియ
- రేపటి నుంచి ప్రైవేట్ మద్యం అమ్మకాలు
- బెల్టు షాపుల ఏర్పాటుకూ ప్రయత్నాలు
- సిండికేట్లను వెనకుండి నడిపిస్తున్న ప్రజాప్రతినిధులు



పెదఅమీరంలోని ఫంక్షన్ హాల్‌లో మద్యం షాపులకు లాటరీ తీస్తున్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, భీమవరం: మద్యాన్ని ఏరులై పారించడమే లక్ష్యంగా ప్రైవేట్ మద్యం షాపులు తెరుచుకోనున్నాయి. అందుకోసం ఏర్పాట్లలో సిండికేట్లు నిమగ్నమయ్యాయి. జిల్లావ్యాప్తంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ మద్యం దుకాణాలు, వాటికి అనుబంధంగా బెల్టు షాపులు ఏర్పాటుచేయాలనే విషయాలపై ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. మరోపక్క మంగళవారంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడనున్నాయి.

గెజిట్ నంబర్.. సర్కిళ్ల వారీగా..

జిల్లాలోని 175 మద్యం షాపులకు 5,627 దరఖాస్తులు రాగా పెద అమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో సోమవారం లాటరీ ప్రక్రియ పూర్తయ్యింది. కలెక్టర్ సీహెచ్ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి దగ్గరుండి డ్రా తీశారు. ఎక్సైజ్ స్టేషన్ల వారీగా భీమవరం పరిధిలో 40, తణుకు పరిధిలో 33, తాడేపల్లిగూడెం పరిధిలో 36, పాలకొల్లు పరిధిలో 19, నరసాపురం పరిధిలో 24, ఆకివీడు పరిధిలో 23 షాపులకు గెజిట్ నంబర్, సర్కిళ్ల వారీగా లాటరీ ప్రక్రియను నిర్వహించారు. లాటరీలో మొదటగా షాపు దక్కిన దరఖాస్తుదారుడు డ్రాప్ అయితే ప్రత్యామ్నాయంగా మరో రెండు రిజర్వు టోకెన్లను తీశారు. ఫంక్షన్ హాలులో ఎస్‌బీఐ ప్రత్యేక క్యాష్ కౌంటర్‌ను ఏర్పాటుచేసి లాటరీలో షాపు వచ్చిన వారి నుంచి అక్కడికక్కడే లైసెన్స్ ఫీజులోని మొదటి కిస్తీ సొమ్ము కట్టించుకుని షాపులు కేటాయించారు.

లక్కున్నోళ్లు

- ఆకివీడు నగర పంచాయతీలో షాపు నం.1, రూరల్‌లోని షాపు నం.9, కాళ్ల మండలంలో షాపు నంబర్లు 12, 13, 14లు కంచి రామ్‌చరణ్‌కు దక్కాయి.
- కాళ్ల మండలంలో షాపు నంబర్లు 15, 19, ఉండి మండలంలో షాపు నం. 22 ఆకివీడుకు చెందిన చిక్కాల సత్యజగదీష్ ప్రసాద్‌కు దక్కాయి.
- భీమవరం రూరల్‌లోని 52వ షాపునకు 18 దరఖాస్తులు రాగా సింగిల్ టెండర్ దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటిపల్లి నాగదుర్గా మల్లేశ్వరరావు దక్కించుకున్నారు.
- వీరవాసరం మండలం నౌడూరులో షాపు నం.60కు 75 దరఖాస్తులు రాగా సింగిల్ టెండర్ వేసిన కదలి మృత్యుంజయునికి దక్కింది.

సిండికేట్లదే పెత్తనం

భీమవరంలోని ఒక సిండికేట్ 350 దరఖాస్తులు వేయగా 14 షాపులు, మరో సిండికేట్ 63 టెండర్లు వేయగా నాలుగు, పాలకొల్లు సిండికేట్ 300 దరఖాస్తులకు ఎనిమిది, పాలకోడేరు సిండికేట్ భీమవరం, ఉండి, నరసాపురం నియోజకవర్గాల్లో 340 టెండర్లు వేయగా 14 షాపులు వచ్చాయి. తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురంలోని సిండికేట్లకు బాగానే షాపులు దక్కినట్టు తెలుస్తోంది. షాపులు ఎవరికి వచ్చినా ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యుల కనుసన్నల్లోనే సిండికేట్లదే పెత్తనమంతా అని చర్చ నడుస్తోంది. ఆయా సిండికేట్లకు చెందిన సభ్యులే అన్నీ తామై నడిపిస్తున్నారు. కొందరు బయటి వ్యక్తులకు షాపులు రాగా ఫంక్షన్ హాల్ వద్దనే సంబంధిత పట్టణ, మండల పరిధిలోని సిండికేట్ సభ్యులు వారితో చర్చించి సిండికేట్లలో కలుపుకునే ప్రయత్నాలు చేశారు. ఆన్‌లైన్‌లో షాపులు దక్కించుకున్న వారి వివరాలు సేకరించి వారిని తమలో కలుపుకునే పనిలో సిండికేట్లు ఉన్నాయి.

ఇక 'బెల్టు' బారులు

జిల్లాలో 175 మద్యం దుకాణాలకు గాను ఐదు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీ పరిధిలో 61 షాపులు, 410 పంచాయతీల్లో 114 షాపులు ఏర్పాటుకానున్నాయి. మద్యం అమ్మకాలు పెంచుకునేందుకు దుకాణాలు లేని గ్రామాలు, అర్బన్ ఏరియాల్లో ఎక్కడెక్కడ బెల్టుషాపులు తెరవాలనే పనిలో సిండికేట్లు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. గ్రామాల్లోని జనాభాను బట్టి రెండు నుంచి ఆరు వరకు బెల్టు షాపులు, పట్టణ ప్రాంతాల్లో మరిన్ని ఎక్కువగా ఏర్పాటుచేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇలా జిల్లాలో 1,100లకు పైగా బెల్టుషాపులు రావచ్చని అంచనా. కొన్నిచోట్ల ఇప్పటికే గతంలోని బెల్టు షాపుల నిర్వాహకులతో సిండికేట్ సభ్యులు చర్చలు సాగిస్తున్నారు. ఒక్కో బెల్టు షాపునకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిపాజిట్ సేకరించే పనిలో ఉన్నారు. డిపాజిట్ చెల్లించిన వారికే సరుకిస్తామని, తమకు తెలీకుండా ఎవరైనా బెల్టు అమ్మకాలు చేస్తే కేసులు పెట్టిస్తామని హెచ్చరిస్తున్నట్టు సమాచారం. మరోపక్క కూటమి నేతలు తమకు కావాల్సిన వారికి బెల్టుషాపులు దక్కించుకునే పనిలో ఉన్నారు.

మద్యం ఆదాయం రూ.131.79 కోట్లు

కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ 2024–2026కు జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు కోసం లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. జిల్లాలో మద్యం షాపుల దరఖాస్తుల ద్వారా రూ.112.54 కోట్ల రుసుం వసూలైందన్నారు. అలాగే లాటరీ ద్వారా ఎంపిక చేసిన 175 దుకాణాలకు లైసెన్స్ ఫీజులో ఆరో వంతు కింద రూ.19.25 కోట్లు జమైందని చెప్పారు. భీమవరం పరిధిలో 40 షాపులకు 1,287, తణుకు పరిధిలో 33 షాపులకు 877, తాడేపల్లిగూడెం పరిధిలో 36 షాపులకు 1,224, పాలకొల్లు పరిధిలో 19 షాపులకు 873, నరసాపురం పరిధిలో 24 షాపులకు 958, ఆకివీడు పరిధిలో 23 షాపులకు 408 దరఖాస్తులు అందాయన్నారు. లాటరీ ప్రక్రియ వీడియో లైవ్ స్ట్రీమింగ్ ఇవ్వడంతోపాటు పక్కాగా రికార్డు చేశామని కలెక్టర్ తెలిపారు.

ప్రత్యేక బ్యాంకు కౌంటర్



బ్యాంక్ కౌంటర్ వద్ద సొమ్ము చెల్లిస్తున్న దృశ్యం

భీమవరం: పెదఅమీరంలోని ఫంక్షన్ హాల్ వద్దే మద్యం షాపుల లైసెన్స్ ఫీజు కట్టించుకోవడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసింది. డబ్బు లెక్కించడానికి ప్రత్యేక యంత్రాలను కూడా ఏర్పాటుచేశారు. షాపుల దక్కించుకున్న వ్యాపారులు ముందుగా ఎక్సైజ్ శాఖ కౌంటర్ వద్ద నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని లైసెన్స్ ఫీజును బ్యాంకు కౌంటర్‌లో జమచేయాల్సి ఉంది. లాటరీ ప్రక్రియ త్వరితగతిన ముగియడంతో ఒకే సమయంలో వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చి లైసెన్స్ ఫీజులు చెల్లించారు.

న్యూస్‌రీల్

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు



మొగల్తూరు : బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా ఏర్పడే అవకాశమున్నందున భారీ వర్షాలతో పాటు సముద్రపు అలలు ఎగసిపడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు మూడు రోజులపాటు సముద్ర వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ కె.రాజకిశోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. మొగల్తూరు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని సెల్ 92915 39408 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆదేశించారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సాక్షి, విశాఖ: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులను ఆ శాఖ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అప్రమత్తం చేశారు. 11 జిల్లాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు. ఏపీఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. భారీ వర్షాల ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్లకొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 94906 10143కు లేదా టోల్‌ఫ్రీ నం.1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచాలి




పెదవేగిలో పోలీస్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

పెదవేగి: దేశంలో మార్పు చెందుతున్న నూతన చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. పెదవేగిలోని పోలీస్ శిక్షణా కేంద్రాన్ని ప్రిన్సిపాల్ హోదాలో సోమవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, డ్రిల్ నిర్వహించే గ్రౌండ్లను పరిశీలించి శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి కల్పించే వసతులు, సదుపాయాలపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఏఏ అంశాల్లో శిక్షణ ఇచ్చారు, ఇంకా ఏఏ అంశాల్లో శిక్షణ ఇవ్వాలనే వివరాలు తెలుసుకున్నారు. ఈ ఏడాది జూలై నుంచి నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని, వీటిపై శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా శిక్షణా కేంద్రం ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్సైలు విజయకుమార్, శ్రీనివాసరావు ఆయన వెంట ఉన్నారు.

ఉచితంగా డీఎస్సీ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వసతితో కూడిన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. టెట్ అర్హత సాధించి కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉండాలని, అభ్యర్థులు ఈనెల 21 లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని, మెరిట్ లిస్ట్ ప్రకారం శిక్షణకు ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో పరిశీలించాలని జేడీ జయప్రకాష్ కోరారు.

టెట్‌కు 309 మంది హాజరు



ఏలూరు (ఆర్ఆర్ పేట): ఏలూరు నగరంలోని రెండు కేంద్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 186 మందికి 160 మంది, మధ్యాహ్నం 186 మందికి 149 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి



మీ కోసంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన రీతిలో పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్య పూర్వాపరాలు తెలుసుకుని ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒకసారి వచ్చిన ఫిర్యాదు మరలా రాకుండా చూడాలన్నారు. మీ కోసం కార్యక్రమంలో 114 అర్జీలు వచ్చాయి. జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రికి షోకాజ్ నోటీసులు

తణుకు: పట్టణంలోని సూర్యాలయం వీధిలోని భాను హాస్పటల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ బి.భానునాయక్ సోమవారం తెలిపారు. ఇటీవల డెంగీ చికిత్స పొందుతూ అత్తిలి మండలానికి చెందిన యువకుడు మృతి చెందిన ఘటనపై గత నెల 27న ఆస్పత్రిలో అధికారులు తనిఖీలు చేశారన్నారు. ఆస్పత్రిలో లోపాలకు సంబంధించి ఈనెల 10న నోటీసులు జారీ చేశామన్నారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన వివరణపై సంతృప్తి చెందకపోతే ఆస్పత్రిని సీజ్ చేస్తామన్నారు.

ధ్వజారోహణం.. దేవతలకు ఆహ్వానం

ఘనంగా చినవెంకన్న బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చరాచర సృష్టిని ఆహ్వానిస్తూ సోమవారం రాత్రి నిర్వహించిన ధ్వజారోహణ వేడుకగా సాగింది. వైఖానస ఆగమోక్తంగా ఇంద్రాది అష్ట దిక్పాలకులు, భేరీ దేవతలు, గంధర్వ, కిన్నెర, కింపురుషాది దేవగణాలు, సప్త అధోలోక జీవులను స్వాగతిస్తూ ఆలయ ధ్వజస్తంభంపై అర్చకులు గరుడ పటాన్ని ఎగురవేశారు. ముందుగా రుత్విగ్వరణ, మృద్గ్రహణ నిర్వహించి పుట్టమన్నును, నవధాన్యాలను తెచ్చి ఆలయ యాగశాలలో ఏర్పాటు చేసిన పాలికల్లో పోసి అంకురార్పణ జరిపారు. అనంతరం బ్రహ్మోత్సవాల వీక్షణకు సర్వదేవతలను ఆహ్వానించే దిశగా ధ్వజారోహణను నిర్వహించారు. గరుడ ప్రసాదాన్ని భక్తులకు అందించారు. హంస వాహనంపై స్వామివారి తిరువీధి సేవ వర్షం కారణంగా రద్దయ్యింది. అలాగే ఆలయ ముఖ మండపంలో స్వామివారు బక సంహారం అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ధ్వజ పటానికి హారతులిస్తున్న అర్చకులు



బక సంహారం అలంకారంలో శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ వాహన సేవ
- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 9 గంటల నుంచి భక్తిరంజని
- ఉదయం 10 గంటల నుంచి భక్తి గీతాలు
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి భరతనాట్యం
- సాయంత్రం 6 గంటల నుంచి బుర్రకథ
- రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహన సేవ
- శ్రీవారి ప్రత్యేక అలంకారం వాల్మీకంలో శ్రీనివాసుడు

ఆరోగ్య ఆసరాకూ మంగళం

కూటమి ప్రభుత్వం పేదలపై కక్షగట్టినట్టు వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది. పేదలకు అందించే వైద్య సాయంపై సైతం నిర్దయగా కోతలు పెడుతోంది. శస్త్రచికిత్సల అనంతరం ఇంటి నుంచి కదలలేని స్థితిలో ఉన్న రోగులకు జగన్ ప్రభుత్వం ఆరోగ్య ఆసరా పథకం కింద అందించిన జీవన భృతిని కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పథకానికి ఎగనామం పెట్టి రోగులను ఇబ్బంది పెడుతోంది.

సాక్షి, భీమవరం : పేదల వైద్యాన్ని చిన్నచూపు చూస్తున్న కూటమి ప్రభుత్వం ఆరోగ్య ఆసరాకు సైతం మొండిచేయి చూపుతోంది. నాలుగు నెలలుగా బిల్లుల చెల్లింపు నిలిపివేసి పేదల సంక్షేమంపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. దీంతో శస్త్రచికిత్స అనంతరం ఇంటిలో నుంచి కదలలేని స్థితిలో ఉన్న రోగులు ఆసరా సాయం అందక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జూన్, జూలై నెలలకు గాను జిల్లాలో రూ.5.41 కోట్ల మేర బకాయిలు పేరుకుపోగా, గత రెండు నెలలుగా ఆరోగ్య ఆసరా వివరాలను వెబ్ సైట్‌లో నమోదు చేయడం నిలిపివేసినట్టు తెలుస్తోంది. పేదల వైద్యానికి పెద్దపీట వేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ తదితర పలు కార్యక్రమాలను అమలు చేసింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం ద్వారా ఆపద ముంచుకొచ్చిన వేళ పేద వర్గాల వారికి నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలిచారు. అనారోగ్య సమస్యలతో పేదలు ఆర్థికంగా దెబ్బతినకూడదని క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా సాయం అందించారు. ఐదేళ్లలో జిల్లాలో రెండు లక్షల మందికి పైగా రోగులకు రూ.436 కోట్ల విలువైన శస్త్ర చికిత్సలు చేయించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు. రూ.5 లక్షల వరకు ఉన్న ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు, 1,059గా ఉన్న చికిత్సల సంఖ్యను 3,257కు పెంచడం ద్వారా పేదల ఆరోగ్యానికి మరింత భద్రతను కల్పించారు.

జీవన భృతిగా ఆరోగ్య ఆసరా

ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స అనంతరం జీవన భృతి కోసం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద ఆర్థిక సాయాన్ని నేరుగా రోగుల ఖాతాలకు జమచేసేవారు. రోగి చేయించుకున్న శస్త్రచికిత్సను బట్టి వారు కోలుకునే నిర్ణీత రోజుల మేరకు రోజుకు రూ.275 చొప్పున సాయం లెక్కగట్టి అందించేవారు. సాధారణ డెలివరీ, సిజేరియన్‌లకు రూ.5 వేల చొప్పున, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి విరిగిన ఎముకలకు సర్జరీ చేయించుకున్నవారికి రూ.10 వేలు, కాలు ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించి సెల్యులైటిస్ కేసులు, కొన్ని కణుతుల చికిత్సలకు రూ.1,575, కొన్ని చెవి, గొంతు, ముక్కు సర్జరీలకు రూ.1,275, గుండె శస్త్రచికిత్సలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు.. ఇలా ఆయా వ్యాధులను బట్టి సాయం అందించేవారు. ఆస్పత్రిలో చేరిన రోజునే ఆరోగ్య మిత్రలు రోగికి సంబంధించిన బ్యాంకు పాస్‌బుక్ వివరాలను ఆరోగ్యశ్రీ ఆసరా వెబ్‌సైట్‌లో నమోదు చేసేవారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే రోజున నిర్ణీత మొత్తాన్ని ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాకు జమ చేసేది. ఆస్పత్రుల నుంచి ఇంటికి వెళ్లాక కోలుకునే వరకు కుటుంబ అవసరాలు తీర్చుకునేందుకు వారికి ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. గత ఐదేళ్లలో ఇలా జిల్లాలో 94,308 మందికి ఆరోగ్య ఆసరా ద్వారా రూ.53 కోట్ల లబ్ధి చేకూరింది. ఇటువంటి పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం

- 'ఆరోగ్య ఆసరా' పథకాన్ని నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- సాయం అందక ఖర్చుల కోసం రోగుల ఇక్కట్లు
- శస్త్రచికిత్స తర్వాత రోగి కోలుకునే వరకు అండగా నిలిచిన గత ప్రభుత్వం
- గత ఐదేళ్లలో 94,308 మందికి రూ.53 కోట్ల లబ్ధి



భీమవరంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న బాలింతలు (ఫైల్)

బిల్లులు చెల్లించని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ఎన్టీఆర్ వైద్యసేవగా పేరు మార్చింది. జూన్ నుంచి ఆరోగ్య ఆసరా బిల్లుల చెల్లింపును నిలిపివేసింది. జూన్ నెలకు గాను ఆరోగ్య ఆసరాకు సంబంధించి రూ.2.59 కోట్లు, జూలైకి సంబంధించి రూ.2.81కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఆగస్టు నుంచి రోగుల బ్యాంకు పాస్‌బుక్‌లు వెబ్‌సైట్‌లో నమోదు చేయడం నిలిపివేసినట్టు తెలిసింది. గతంలో ఆస్పత్రిలో అడ్మిట్ అయినప్పుడు బ్యాంకు పాస్‌బుక్ జెరాక్స్‌లు తీసుకునేవారని, ఇప్పుడు ఆసరా రావడం లేదని, పాస్‌బుక్‌లు అవసరం లేదని ఆరోగ్య మిత్రలు చెబుతున్నారని రోగుల బంధువులు అంటున్నారు. ఆరోగ్య ఆసరా సాయం నిలిచిపోవడంతో కోలుకునే వరకు జీవన భృతి కోసం రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ కోసం అయినకాడికి అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వంలో పెండింగ్ బిల్లులు

నెల	శస్త్ర చికిత్సలు	ఆరోగ్య ఆసరా లబ్ధిదారులు	అందాల్సిన సాయం (రూ. కోట్లలో)
జూన్	6,813	4,623	2.59
జూలై	7,633	4,915	2.81
ఆగస్టు	7,454	0	0
సెప్టెంబరు	5,929	0	0

గత ప్రభుత్వంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా సాయం

సంవత్సరం	కేసులు	ప్రభుత్వ వ్యయం
2019–20	4,487	రూ. 2.8 కోట్లు
2020–21	10,809	రూ. 6.2 కోట్లు
2021–22	18,518	రూ. 9.4 కోట్లు
2022–23	26,254	రూ.16.32 కోట్లు
2023–24	34,240	రూ.18.59 కోట్లు

సూరి భగవంతం సేవలు ఎనలేనివి



డాక్టర్ సూరి భగవంతం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి పార్థసారథి తదితరులు

ఆగిరిపల్లి : భారతదేశ రక్షణ రంగం క్షిపణి విభాగంలో ఎనలేని సేవలు అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ సూరి భగవంతం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం ఆగిరిపల్లిలోని వేద పాఠశాలలో సూరి భగవంతం 115వ జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ జి.సతీష్ రెడ్డితో కలిసి మంత్రి పార్థసారథి ఆవిష్కరించారు. దేశంలో రక్షణ రంగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఆగిరిపల్లి గ్రామస్తుడు కావడం గర్వకారణమన్నారు. సూరి భగవంతం జీవిత విశేషాలు తెలిసేలా స్మారక కేంద్రాన్ని నూజివీడులో ఏర్పాటు చేస్తానని, ఆయన పేరున ఏటా అవార్డులు అందిస్తామన్నారు. డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ సూరి భగవంతం 1961 నుంచి తొమ్మిదేళ్ల పాటు కేంద్ర రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థల చైర్మన్‌గా పనిచేశారన్నారు. ఆ సమయంలో రక్షణ రంగానికి సంబంధించి 25 ప్రయోగశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సూరి భగవంతం నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ సీవీ రామన్ ప్రియ శిష్యులన్నారు. అనంతరం సూరి భగవంతం జీవిత చరిత్ర ప్రచురించిన 'వైజ్ఞానిక క్రాంతికిరణం' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

ఉండి: ఉండికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఉండి గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 11న మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా అదృశ్యమైంది. ఎంత వెదికినా బాలిక ఆచూకీ లభించలేదని, ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: ముసునూరు పోలీస్ స్టేషన్‌లో బాలిక(17) కిడ్నాప్ కేసు నమోదైంది. ఎస్సై ఎం.చిరంజీవి చెప్పిన వివరాల ప్రకారం.. రమణక్కపేట దళితవాడకు చెందిన బాలిక ఈ నెల 12న అదృశ్యమైంది. బంధువులు, తెలిసిన వారి ఇండ్ల వద్ద వెదకినా ఆచూకీ లభ్యం కాలేదు.తమ గ్రామానికి చెందిన ఆముదాల బుచ్చిబాబు, తాతయ్యలు కిడ్నాప్ చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.దీంతో తల్లిదండ్రులు ముసునూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం వ్యసనం

కోనేరుసెంటర్: మద్యం వ్యసనం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. చిలకలపూడి పోలీసుల వివరాల ప్రకారం భీమవరానికి చెందిన గొర్రెల వెంకటేశ్వరరావు(40) మద్యానికి బానిసయ్యాడు. కొన్ని రోజుల క్రితం మచిలీపట్నం వచ్చాడు. భిక్షాటన డబ్బులతో మద్యం సేవిస్తుంటాడు. డబ్బులు చాలని పక్షంలో సమీపంలోని బార్‌లలోకి చొరబడి వేరే వ్యక్తుల మందు తాగేస్తుంటాడు. ఆదివారం బైపాస్‌రోడ్డులోని ఓ బార్‌లోకి వెళ్లి ఇతరులు తాగుతున్న మద్యాన్ని లాక్కుని తాగుతుండగా కొంత మంది మందలించి బయటకి నెట్టేశారు. బార్‌లోకి వెంకటేశ్వరరావు మరోసారి చొరబడి అన్నపురెడ్డి క్రాంతికిరణ్ గ్లాసులో మద్యం మూడు సార్లు తాగాడు. ఆగ్రహంతో ఊగిపోయిన క్రాంతికిరణ్ పక్కనే ఉన్న బాదుతో వెంకటేశ్వరరావును విచక్షణారహితంగా కొట్టాడు. దెబ్బలకు తట్టుకోలేని వెంకటేశ్వరరావు సమీపంలోని ఓ సందులోకి వెళ్లి స్పృహ కోల్పోయి పడిపోయాడు. అటుగా వెళుతున్న వ్యక్తి చిలకలపూడి పోలీసులకు సమాచారం అందించాడు. వెంకటేశ్వరరావును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు.

బంగారం చోరీ

ఆకివీడు: స్థానిక ముస్లిం వీధిలో నివసిస్తున్న అజ్మీర్ బాబా ఈ నెల నాలుగున అమెరికా వెళ్ళగా ఆయన ఇంట్లో 13వ తేదీ సాయంత్రం చోరీ జరిగింది. అజ్మీర్ బాబా గుమస్తా మూబీన్ ఫిర్యాదు మేరకు బీరువాలోని మూడు కాసుల బంగారు ఆభరణాలు వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉంగుటూరు: జాతీయ రహదారిపై బాదంపూడి వై-జంక్షన్‌లో సోమవారం సాయంత్రం బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో బొమ్మిడి గ్రామానికి యర్రా పెద్దిరాజు(65) మృతిచెందాడు. పెద్దిరాజు, అతని భార్య ఉంగుటూరు వెళ్లారు. తిరిగి బొమ్మిడి వెళ్తుండగా బాదంపూడి వై-జంక్షన్ దాటే సయమంలో కారు ఢీకొంది. హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేసరికి పెద్దిరాజు మృతిచెందాడు. గాయపడిన నాగమణిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

తిరుగు ప్రయాణం పాట్లు

- దసరా ముగియడంతో హైదరాబాద్ బాట
- రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్లు ఫుల్..
- అధిక ధర చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం



ఏలూరు (టూటౌన్): దసరా, దీపావళి పండుగల సీజన్‌లో సొంతూళ్లకు వచ్చి తిరిగి వెళ్లేందుకు గోదావరి వాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడో రెండు మూడు నెలల క్రితం రిజర్వేషన్ చేసుకుంటే తప్ప సుఖంగా ప్రయాణం చేయలేం. అప్పటికప్పుడు ప్రయాణం అంటే నరకమే.. పండుగల రద్దీకి అనుగుణంగా రైల్వే అధికారులు తగినంత ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నెల రోజుల వరకు రైళ్లలో సీట్లన్నీ రిజర్వేషన్లు ఫుల్ అయిపోయాయి. అవసరం మేరకు ప్రత్యేక రైళ్లను నడపడంలోనూ అధికారులు విఫలమయ్యారు. దీంతో పండుగలకు స్వగ్రామాలకు వచ్చిన వారు ఎన్నో ఇబ్బందులు పడగా.. ఇప్పుడు తిరుగు ప్రయాణంలోనూ ఎక్కువ మంది ప్రైవేట్ ట్రావెల్ బస్సులనే ఆశ్రయించాల్సిన వస్తోంది.

చార్జీల మోత

హైదరాబాద్ నుంచి రైలులో రిజర్వేషన్‌తో రూ.300 నుంచి రూ.400కే ఏలూరుకు వచ్చే ప్రయాణికులు బస్సుల్లో నాలుగు నుంచి ఐదు రెట్ల ధర చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నుంచి ఏలూరు, రాజమహేంద్రవరం, తుని, అనకాపల్లి, విశాఖ పట్టణం, విజయనగరం, శ్రీకాకుళం వరకు వేల సంఖ్యలో ప్రయాణికులు పండుగ రోజుల్లో ప్రయాణిస్తుంటారు. వీరంతా నెల రోజుల ముందు నుంచే రిజర్వేషన్లు చేయించుకుని తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు సమాయత్తమవుతుంటారు. 15 రోజుల ముందు నుంచే హైదరాబాద్ నుంచి విశాఖ పట్టణం వైపు వచ్చే రైళ్లన్నింటిలో రిజర్వేషన్లు ఫుల్ అవడంతో దసరాకు ఊళ్లకు రావడానికి ఇబ్బందిపడ్డారు. ఇప్పుడు తిరుగు ప్రయాణంలోనూ ఇక్కట్లు పడుతున్నారు.

ఏలూరు ప్రాంత వాసులు 5 వేలకు పైగానే

దసరా, దీపావళి పండుగలకు తమ సొంతూళ్లకు వచ్చే వారు ఏలూరు, దాని పరిసర ప్రాంతాల వారే దాదాపు 5 వేల మందికి పైగా ఉంటారు. వీరు అధికంగా రైళ్లల్లోనే ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం రిజర్వేషన్లు లేకపోవడం తత్కాల్ టిక్కెట్‌లు ఓపెన్ చేసిన కొద్ది సేపటికే ఆన్‌లైన్‌లో బుక్ అయిపోవడంతో తిరిగి ఉద్యోగం చేసే ఊరికి ఎలా వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

రెండు ప్రత్యేక రైళ్లు

దసరా పండుగ రద్దీ పేరుతో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకు కేవలం రెండు ప్రత్యేక రైళ్లను 10 నుంచి 18 వరకు పాటు నడుపుతోంది. వీటి గురించి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సమాచారం లేకపోయినా ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా ముందుగానే బుక్ చేసేసుకుంటున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ సెంటర్‌ల నిర్వాహకులు టిక్కెట్‌ను వారే ముందుగా బుక్ చేసేసి ఆ తర్వాత అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. మొత్తంగా రైల్వే శాఖ అధికారులు పండుగ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడపడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాటు సారా విక్రేతలపై కేసు నమోదు

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెంలో నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. కుక్కునూరు సీఐ రమేష్ బాబు వివరాల ప్రకారం మండలంలోని పెద్దరావిగూడెంలో నాటు సారా అమ్ముతున్నారన్న సమాచారంతో దాడులు చేశారు. దాడిలో పానగల రమణ వద్ద ఐదు లీటర్ల నాటు సారా లభించినట్లు సారాను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

బోట్ల వ్యర్థాలతో గోదావరి కలుషితం

పోలవరం రూరల్: పర్యాటకులను పాపికొండలకు తీసుకువెళ్లే టూరిజం బోట్లలోని వ్యర్థాలను గోదావరి నదిలో వేయకూడదని పోలవరం అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్‌కే వలీ తెలిపారు. టూరిజం బోట్లలో వాడే ప్లాస్టిక్ కవర్లు, వాటర్‌బాటిళ్లను బోట్లలో డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి అందులో వేసేలా చూడాలన్నారు. బోటులోని వ్యర్థాలను నది ఒడ్డుకు చేర్చి దానిని తగులబెట్టాలని, చెల్లాచెదురుగా పడవేయకూడదన్నారు. వీటి వల్ల కాలుష్యం అధికమవుతుందన్నారు. పాపికొండలకు పర్యాటకులను తీసుకువెళ్లే టూరిజం బోట్ల యజమానులు వన్యప్రాణి విభాగం అధికారుల అనుమతులు కూడా పొందాలన్నారు.

రూ.20 వేలు ఇస్తేనే ఆపరేషనట!

- తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఈఎన్‌టీ వైద్యుడి నిర్వాకం

తణుకు అర్బన్: రూ.20 వేలు తీసుకొస్తేనే ఆపరేషన్ చేస్తానన్న వైద్యుడి నిర్వాకం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆగస్టు 19న తణుకుకు చెందిన పి.జ్యోతి తన కుమారుడు పవన్‌ను తీసుకుని జిల్లా కేంద్ర ఆస్పత్రికి వచ్చారు. గొంతు నొప్పి, ముక్కు సమస్యతో ఓపీ రాయించుకుని ఈఎన్‌టీ వైద్యుడిని కలిశారు. వైద్యపరీక్షల అనంతరం రిపోర్టులు పరిశీలించిన వైద్యుడు పవన్‌కు గొంతు, ముక్కుకు ఆపరేషన్ పడుతుందని ఇక్కడ అవ్వదని రూ.20 వేలు తీసుకొస్తే వేరే చోట చేస్తానని చెప్పారు. అప్పటి నుంచి మందులు వాడుతూ మళ్లీ ఈ నెల 8వ తేదీన మరో వైద్యుడి సిఫార్సుతో అదే ఈఎన్‌టీ వైద్యుడిని కలవగా ఈ శస్త్రచికిత్స ఎక్కడా అవ్వదని విశాఖపట్నంలో మాత్రమే అవుతుందని చెప్పారు. దీంతో బిత్తరపోయిన మహిళ అంతదూరం వెళ్లలేమని, రూ.20 వేలు ఇచ్చి వైద్యం చేయించుకునే స్తోమత లేదంటూ ఇంటికెళ్లిపోయారు.



బాధితులకు సంబంధించిన ఓపీ చీటీ

గతం నుంచి ఆరోపణలు

ఈ విభాగంతోపాటు సదరం ధ్రువపత్రాల పరిశీలనలో సైతం కొన్ని విభాగాల్లో గతం నుంచి ఎన్నో ఆరోపణలు వినిపిస్తున్నా ఫిర్యాదులు లేవనే ధోరణిలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అవినీతికి పాల్పడే వైద్యవర్గాలు ఆస్పత్రిలోని కిందిస్థాయి సిబ్బందిని దళారులుగా ఉపయోగించుకుంటూ డబ్బులు గుంజుతున్నారని సమాచారం. 150 పడకలతో అత్యున్నత సేవలందిస్తూ 450 పడకల ఆస్పత్రులతో పోటీ పడుతూ మొదటి వరసలో ఉన్న తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి అవినీతి మరకలు అంటుకున్నాయి. ముఖ్యంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలకు సంబంధించి ఈఎన్‌టీ విభాగంలో ఇద్దరు వైద్యులున్నప్పటికీ ఈ విభాగ సేవలు రోగులకు ఎంతమేర అందుతున్నాయో గణాంకాలు చూస్తేనే అర్థమవుతోంది. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణను సాక్షి వివరణ కోరగా వైద్యులు డబ్బులు అడిగారని బాధితులెవరైనా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

> **రూ.20 వేలు తెమ్మన్నారు**
>
> మా అబ్బాయిని తీసుకుని తణుకు ప్రభుత్వాసుపత్రిలో ఈఎన్‌టీ వైద్యుడిని కలిశాను. ముందుగా ఓపీ చీటీపై పరీక్షలు రాసి చేయించుకుని రమ్మన్నారు. అనంతరం మళ్లీ కలవగా ఆపరేషన్ పడుతుందని రూ.20 వేలు తెచ్చుకుంటే బయట ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి గొంతు, ముక్కులోని కాయలను తొలగిస్తానని చెప్పారు. అంత డబ్బులు ఇవ్వలేక మందులు వాడిస్తూ గడిపాను. తెలిసిన మరొక వైద్యుడితో సిఫార్సు చేయిస్తే ఈ ఆపరేషన్ ఇక్కడ అవ్వదని విశాఖపట్నం వెళ్లాల్సిందిగా చెప్పారు.
>
> **పి.జ్యోతి, తణుకు**

మహిళల కబడ్డీ విజేతగా విజయనగరం

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో గత మూడు రోజులుగా సాగుతున్న 72వ అఖిల భారత పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. మహిళల కబడ్డీ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. ఫైనల్‌లో విశాఖ జట్టుపై 14-12 స్కోరుతో గెలుపొందింది. ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు క్రీడాకారులను తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు పరిచయం చేసుకున్నారు. పురుషుల ఫైనల్ మ్యాచ్ కృష్ణా, విజయనగరం జట్ల మధ్య జరగగా.. మ్యాచ్‌కు ముందు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు రెండు టీంల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కృష్ణా జట్టు 26-16 తేడాతో విజేతగా నిలిచింది. విజేతలకు మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. నూజివీడులో పూర్వకాలం నుంచి ఆటలకు గొప్ప పేరుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు ఆటల గురించి తెలియజేయడంతో పాటు ఆడుకునే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు, ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, స్పోర్టింగ్ క్లబ్ సెక్రటరీ టీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


మహిళల విజేత విజయనగరం జట్టుకు ట్రోఫీ అందజేస్తోన్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

భజన కళాకారులకు సౌకర్యాలు కల్పించాలి

ద్వారకాతిరుమల: హిందూ ధర్మ పరిరక్షణ కోసం స్వచ్ఛందంగా పనిచేస్తున్న భజన కళాకారులను గుర్తించకుండా, వారికి కనీస సౌకర్యాలు, ప్రదర్శనలకు అవకాశాలు ఇవ్వకపోవడం హిందూ ధర్మాన్ని అవమానించడమేనని అన్నమయ్య జానపద కళాక్షేత్రం (తిరుమల తిరుపతి) పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయ శంకర స్వామి అన్నారు. ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రంలో సోమవారం హైందవ భక్త భజన బృందాల సమ్మేళన కార్యక్రమాన్ని సకల కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దువ్వి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ శంకర స్వామి ముందుగా క్షేత్రంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. శ్రీవారి కొండపై భజన బృందాలకు హరినామ సంకీర్తనలు ఆలపించేందుకు అవకాశాలు కల్పించాలని, భజన గురువులకు, కోలాట బృందాల గురువులకు రూ. 10 వేలు గౌరవ వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దువ్వి రామారావు మాట్లాడుతూ స్థానిక శ్రీహరి కళాతోరణ వేదికపై భజనలు చేసేందుకు అవకాశం కల్పించి, మైకులను ఇవ్వకుండా ఆటంకం కలిగించడం కళాకారులను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు. భజన కళాకారులకు గుర్తింపు కార్డులు, ప్రయాణ రాయితీలను ప్రభుత్వం కల్పించాలని కోరారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం నాయకులు సాయన సహదేవరాజు మాట్లాడుతూ కళాకారులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు.


శ్రీవారి ఆలయానికి శోభాయాత్రగా వస్తున్న శ్రీశ్రీశ్రీ విజయ శంకర స్వామి

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: అప్పుల బాధ తట్టుకోలేక పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పాలకొల్లు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఏఏఎస్ఎన్ కాలనీలో ఉంటున్న సానబోయిన సురేష్(44) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కార్లు అమ్ముతూ కొంటు ఉంటాడు. కార్ల వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగాయి. సోమవారం ఉదయం భార్య గదిలోకి వెళ్లి చూడగా సురేష్ మంచంపై కొట్టుకుంటున్నాడు. గమనించిన దుర్గాలక్ష్మీ బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పింది. బంధువులు వెంటనే హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్రంపాడులో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరులోని శాంతినగర్ రెండో రోడ్డులో ఉంటున్న జాలపర్తి రమాదేవి ఏలూరు కోటదిబ్బ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 13న రాత్రి పక్కింటికి వెళ్ళి నిద్రించారు. 14వ తేదీ తెల్లవారుజామున వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. మొత్తం ఏడు తులాల బంగారు వస్తువులు, 100 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయని ఏలూరు త్రీటౌన్ పోలీసులకు రమాదేవి ఫిర్యాదు చేశారు.

చెరువులోకి దూకి మహిళ ఆత్మహత్య

భీమవరం: భీమవరం పట్టణం గునుపూడి వద్ద సోమగుండం చెరువులో దూకి కె.సీతామహాలక్ష్మి (62) ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ జి.చక్రవర్తి చెప్పారు. సీతామహాలక్ష్మి సోమవారం ఉదయం ఇంట్లో కనిపించక పోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమగుండం చెరువులో మహిళ మృతదేహం ఉందంటూ చుట్టుపక్కల వారు తెలపడంతో సీతామహాలక్ష్మిగా గుర్తించారు. మృతురాలి కుమారుడు వెంకట మురళీ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చక్రవర్తి తెలిపారు.

గొలుసు చోరీ

ఏలూరు టౌన్: కారులో నిద్రపోతున్న మహిళ మెడలోని బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా సరిబుజ్జిలి మండలం పురుషోత్తపురానికి చెందిన తవిటి నాయుడు కుటుంబ సభ్యులు విజయవాడ శ్రీ కనక దుర్గ అమ్మవారి దర్శనం చేసుకుని ఆదివారం బయలుదేరారు. ఏలూరు మినీ బైపాస్‌లోని రత్నాస్ హోటల్ వద్దకు వచ్చేటప్పటికి డ్రైవర్‌కు నిద్రరావడంతో రత్నాస్ హోటల్ పక్కన సర్వీసు రోడ్డులో కారు ఆపి పడుకున్నారు. డ్రైవర్ దగ్గర ఉన్న అద్దాన్ని దించి ఉంచడంతో గుర్తు తెలియని వ్యక్తులు అక్కడకు వచ్చి వెనుక సీటులో కూర్చున్న మహిళ మెడలోని రెండున్నర కాసుల బంగారపు గొలుసును కట్ చేసి తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: గుండుగొలనుకు చెందిన ఓ వ్యక్తి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బోడా కుమార్‌రాజా(45) గడ్డి మందు తాగి ఈనెల 13న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.



బోడాకుమార్‌రాజా, మృతుడు

వరద ఖర్చుల అవినీతిపై దర్యాప్తు చేయాలి

ఏలూరు (టూటౌన్): వరద ఖర్చుల అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఏలూరు నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ.. విజయవాడ వరదల సందర్భంగా వరద ఖర్చులు చూస్తే పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు అర్థమవుతుందన్నారు. కోటి మందికి భోజనాలకు రూ.368 కోట్లు ఖర్చు పెట్టినట్లుగా లెక్కలు చెప్పారని.. అంటే సరాసరి రోజుకు పది లక్షలకు పైగా ఆహారం అందించినట్లు లెక్కరాశారన్నారు. అవినీతి స్పష్టంగా కనిపిస్తుందని.. నిజానికి మొదటి మూడు రోజులు వరద బాధితులకు ఆహారం దాతలే అందించారని చెప్పారు. దాతలు అందించిన రూ.500 కోట్లు పక్కదారి పట్టించినట్లు స్పష్టంగా అర్థంఅవుతుందన్నారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నగర సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, ముంగం అప్పారావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని పాల్గొన్నారు.

వేరుశనగ సాగు.. సస్యరక్షణతో బాగు

- వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలి
- వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగకుమార్ సూచన


మెట్ట ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ

పాడి - పంట

చింతలపూడి: నూనె గింజల పంటల్లో వేరుశనగ పంటకు విశిష్ట స్థానం ఉంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఖరీఫ్, రబీ పంటలుగా వేరుశెనగ పంటను రైతులు పండిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట సాగులో ఉంది. రబీ వేరుశనగ కోసం రైతులు ఇప్పటి నుంచే విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. మెట్ట ప్రాంతంలో వేరుశనగ పంట అధికంగా పండుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటగా రైతులను ఆదుకుంటోంది. వేరుశనగ సాగుకు ఇసుకతో కూడిన గరప నేలలు, ఎర్ర గరప నేలలు అనుకూలం. సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ తెలిపారు. వేరుశనగ పంటకు వేరు పురుగు, ఎర్ర గొంగళి, తామరపురుగు, పేనుబంక, పచ్చ పురుగు ఆకు ముడత, లద్దె పురుగులు ఆశించి నష్టపరుస్తాయని, వేరుశనగ పంటల సాగులో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను గురించి ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

విత్తన శుద్ధి

తొలుత నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి. కిలో వేరుశనగ విత్తనాలకు 3 గ్రాముల మాంకోజెబ్ లేక ఒక గ్రాము కార్బెండెజిమ్ పొడి మందును కలుపుకోవాలి. వేరు పురుగు ఉధృతి ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మి.లీ క్లోరిపైరిఫాస్, లేక 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ చొప్పున కలిపి శుద్ధి చేసుకోవాలి.

విత్తడం

విత్తనాలను గొర్రుతో కాని నాగలి చాళ్ళలో కాని విత్తాలి. విత్తనాలు విత్తే సమయంలో నేలలో తగినంత తేమ ఉండాలి. విత్తనాన్ని 5 సెం.మీ లోతు మించకుండా విత్తుకోవాలి.

సూక్ష్మ పోషక లోపాల నివారణ

జింక్ లోపం ఉన్న వేరుశనగ పంట మొక్కలు గిడసబారతాయి. ఆకులు చిన్నవిగా మారి గుబురుగా కనిపిస్తాయి. ఆకుల ఈనెల మధ్య పసుపు రంగులోకి మారతాయి. దీని నివారణకు ఎకరాకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి వారం మధ్యలో రెండు సార్లు పిచికారీ చేయాలి. నల్ల రేగడి నేలల్లో ఇనుము ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. లేత ఆకులు పసుపు పచ్చగాను తరువాత తెలుపు రంగులోకి మారతాయి. ఈ లోపాన్ని సవరించడానికి ఎకరానికి ఒక కిలో అన్నభేది, 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

కలుపు నివారణ

చేలో కలుపు మొలకెత్తక ముందే నశింపచేయగల కలుపు నాశిని బూటా క్లోర్ 50 శాతం 1.25-1.5 లీ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తనం విత్తిన వెంటనే కాని, లేదా రెండు, మూడు రోజుల లోపల నేలపై పిచికారీ చేయాలి. విత్తిన 20-25 రోజులకు గొర్రుతో అంతర కృషి చేయాలి. విత్తిన 45 రోజుల వరకు ఎలాంటి కలుపు లేకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

నీటి యాజమాన్యం

వేరుశనగ పంటను ఆరుతడి పంటగా రైతులు సాగు చేస్తారు. తేలిక నేలల్లో అయితే 8 నుంచి 9 తడులు పెడితే సరిపోతుంది. విత్తే ముందు నేల బాగా తడిసేటట్లు నీరు పెట్టి తగినంత చెమ్మ ఉన్నప్పుడు విత్తనం పెట్టుకోవాలి. విత్తిన 20, 25 రోజులకు రెండవ తడిని పెట్టాలి. తరువాత తడులను నేల స్వభావం, తేమ శాతాన్ని అనుసరించి 7 నుంచి 10 రోజులకు ఒకసారి పెట్టుకోవాలి. ఆఖరి తడిని మాత్రం పంట కోతకు 15 రోజుల ముందు పెట్టాలి. నీటిని తుంపర్లు, స్ప్రింక్లర్ల ద్వారా పెట్టుకుంటే రైతుకు 25 శాతం నీరు ఆదా అవ్వడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది.

ఎర్రగొంగళి పురుగు నివారణకు

ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ లేక, మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

వేరుపురుగు నివారణకు

వేరు పురుగు ఆశించిన మొక్కలు వాడి, ఎండి నశించిపోతాయి. మొక్కలను పీకితే సులువుగా ఊడి వస్తాయి. పొలంలో లోతు దుక్కులు చేయడం వలన వేరు పురుగు కోశస్థదశ బయటపడి పక్షుల బారిన పడతాయి. లేదా ఎండ వేడికి చనిపోతాయి. ఫోరేటు 10 శాతం గుళికలు ఎకరాకు 6 కిలోల చొప్పున గింజ విత్తే సమయంలో వేసుకోవాలి. ఒక కిలో విత్తనానికి 6.5 మి.లీ క్లోరిపైరిఫాస్ మందును కలిపి విత్తుకోవాలి.

ఆకు ముడతను నివారించాలిలా..

విత్తిన 15 రోజుల నుంచి ఆశిస్తుంది. ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. వాటి మధ్య ఆకుమచ్చ రంగులో పిల్ల పురుగులు ఉంటాయి. ఇవి ఆకుల పచ్చదనాన్ని తినడం వల్ల ఆకులు ఎండి కాలినట్లు ఉంటాయి. వీటి నివారణకు క్వినాల్ ఫాస్ 2.0 మి.లీ లేక మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేక క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పేనుబంక, పచ్చ దోమ నివారణకు డైమిథోయేట్ 2.0 మి.లీ లేక మిథైల్‌ఓ-డెమటాన్ 2.0 మి.లీ లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


బి నాగకుమార్
వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

క్లుప్తంగా

టిడ్కో సముదాయాన్ని పరిశీలించిన కమిషనర్



టిడ్కో సముదాయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: టిడ్కో భవన సముదాయాన్ని సోమవారం మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. పిచ్చి మొక్కలు తొలగించి, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో 24 గంటలు పనిచేసే విధంగా మునిసిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఈ నెంబర్‌కి ఫోన్ చేసి 08818 224188 తెలియజేయాలన్నారు.

ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని తాడేపల్లి గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకొని వారానికొకసారి డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య సిబ్బంది దానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావ్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్త కుమారి, ఆరోగ్య సహాయకులు కమలాకర్, ఏలూరి కాంతారావు పాల్గొన్నారు.

పీసీబీపై శశిలో అవగాహన



పీసీబీపై శశిలో విద్యార్థులకు అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ)పై సోమవారం శశిలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉపయోగించి పీసీబీ డిజైన్‌లో సర్క్యూట్స్ రూపొందించడం నేర్చుకున్నారు. ఎస్ఎస్ఐటీ సీఓఓ సూర్య త్రినాథ్ మాట్లాడుతూ టెక్నాలజీలో ప్రాథమిక అంశాలు, వినియోగాన్ని అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.నవీన్ కిషోర్, కోఆర్డినేటర్ రవితేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు తదితరులు

తాడేపల్లిగూడెం: పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు తెలిపారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాపై సోమవారం మారిశెట్టి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేబొలిశెట్టి శ్రీనివాసు మాట్లాడుతూ ఓట్ల నమోదుపై చేపట్టాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఓటర్ల నమోదులో కూటమి నాయకులు ముందుండాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ,గూడెం తెదేపా ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు అందించాలి

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో సీపీఎం మండల కమిటి సమావేశం కండెల్లి సోమరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తుందని, కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, ఇసుక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండల కమిటి సభ్యులు ఎస్.నాగేశ్వరరావు, పి.జయమ్మ, పూరెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కిక్కు వదిలింది.. లక్కు తేలింది..

- ముగిసిన మద్యం షాపుల లాటరీ
- 33 షాపులకు ఖరారైన లైసెన్సుల మంజూరు
- రేపటి నుంచి అందుబాటులోకి కొత్త మద్యం

తణుకు: మందుబాబులకు చల్లగా బీరు, మందు పట్టించి కాసుల వర్షం కురిపించాలని మద్యం వ్యాపారులు కలలు కన్నారు... లాటరీలో తమకే మద్యం షాపు వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు... రూ. 2 లక్షలు వెచ్చించి దరఖాస్తు పెట్టుకున్నారు... కళ్లనిండా వత్తులు వేసుకుని లాటరీ వరకు ఉత్కంఠతో ఎదురు చూశారు. తణుకు సర్కిల్ పరిధిలోని ఒక్కో షాపునకు సరాసరి 30 మంది పోటీ పడ్డారు. అయితే ఒక్కో మద్యం షాపు ఒక్కరినే వరించడంతో మిగిలిన వారంతా ఖంగు తిన్నారు. లాటరీ తగలని వారికి కిక్కు వదిలిపోగా... రూ. 2లక్షలు గంగలో పోసినట్లు అయ్యింది. లాటరీలో షాపు వచ్చిన వారు మాత్రం తమ లక్కు కలిసి వచ్చిందని సంబరాలు చేసుకుంటున్నారు.

ఇక మద్యం పరవళ్లు

ఎన్నికల్లో చెప్పినట్టే కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారించేందుకు రంగం సిద్ధంచేసింది. ఇందులో భాగంగానే నూతన మద్యం పాలసీను తీసుకువచ్చింది. సర్కారు మద్యం దుకాణాలు తొలగించి ప్రైవేటు షాపులను ఏర్పాటు చేయడానికి లైసెన్సులు ఖరారు చేసింది. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వం కేటాయించిన 33 షాపులకు సంబంధించి 877 దరఖాస్తులు రాగా సోమవారం భీమవరంలో నిర్వహించిన లక్కీ డ్రాలో లైసెన్సుదారులను ఖరారు చేశారు. తణుకు మున్సిపాలిటీలో 9 షాపులు, తణుకు మండలంలో 5, ఇరగవరం మండలంలో 4, పెనుగొండ మండలంలో 9,పెనుమంట్ర మండలంలో 6 మద్యం షాపులకు



తణుకులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం

సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. మొత్తం 33షాపులకు సంబంధించి దరఖాస్తు ఫీజు రూపంలో రూ.17.54 కోట్లు ఆదాయం సమకూరింది. ఇదిలా ఉంటే తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇరగవరం మండలంలో 143వ నెంబరు షాపునకు అత్యధికంగా 46 దరఖాస్తులు రాగా రెండో స్థానంలో సైతం అదే మండలంలో 144 నెంబరు షాపుకోసం 40మంది పోటీ పడ్డారు. అత్యల్పంగా పెనుగొండ మండలంలో 147వ నెంబరు షాపు కోసం కేవలం 15 మంది మాత్రమే పోటీ పడ్డారు.

16 నుంచే దుకాణాలు

మద్యం సాపు కోసం లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారుడితో పాటు మరో ఇద్దరిని రిజర్వుడ్ దరఖాస్తుదారులను ఎంపిక చేశారు. ఎంపికైన వ్యక్తి నిర్ణీత వ్యవధిలో లైసెన్సు ఫీజు చెల్లించలేని పక్షంలో రిజర్వులో ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు. లాటరీ దక్కిన వ్యక్తి 24 గంటలలోపు లైసెన్సు ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. లేదంటే షాపును కోల్పోయినట్లే. షాపు ఏర్పాటు చేసిన తర్వాత రెగ్యులర్ లైసెన్సు జారీ చేయనున్నారు. లాటరీ దక్కించుకున్న వారు ఈనెల 16 నుంచే మద్యం దుకాణాలు తెరుచుకునేందుకు అనుమతి ఇస్తామని తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు.

రింగ్ రివర్సు అయ్యింది

తాడేపల్లిగూడెం: గూడెం ఎక్సైజ్ సర్కిల్‌లో 36 దుకాణాలను గంప గుత్తగా దక్కించుకోవాలన్న కూటమి నాయకుల ఆశలు నెరవేరలేదు. కొత్త ముఖాలను లాటరీ వరించింది. 50 శాతానికి కంటే తక్కువ దుకాణాలు మాత్రమే కూటమి తరపున దరఖాస్తులు చేసిన వారికి వచ్చాయి. తెలుగుదేశం నాయకుల పేరిట నేరుగా రెండు దుకాణాలు రాగా, మిగిలినవి కొన్ని వారి బినామీల పేరిట వచ్చాయి.పెంటపాడు మండలంలో ఒక దుకాణం పట్టణ తెదేపా మాజీ అధ్యక్షుడు తాటికాయల వీరన్నకు దక్కింది. తాడేపల్లిగూడెం పట్టణంలో ఒక దుకాణం పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరానికి వచ్చింది. పైబోయిన వెంకట్రామయ్య పేరిట ఒకటి వచ్చింది. బార్ల తరపున సుమారు 90 దరఖాస్తులు వేస్తే ఒక దుకాణం కూడా రాలేదు. తెదేపా, జనసేన సానుభూతి పరులుగా ఉన్న కొందరు తమ బంధువులు స్నేహితుల పేరిట దరఖాస్తులు ఇస్తే వారిలో ఒక నలుగురికి దుకాణాలు దక్కాయి. నియోజకవర్గంలోని కూటమి నాయకులు ఏలూరు జిల్లాలో కూడా



మద్యం దుకాణం

దుకాణాలకు దరఖాస్తులు చేయగా పనైంది. కొత్తగా ట్రేడ్‌లోకి రావాలనే ఆశతో ఉన్న వారు, వేసిన దరఖాస్తులు కొన్ని జాక్‌పాట్ కొట్టాయి.

దివ్యాంగులను ఆదరించాలి



భవిత సెంటర్‌లో అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ఆదరించాలని, ప్రతి పాఠశాలలోను అభ్యసన సమస్యలు కలిగిన పిల్లలు సుమారు 20 శాతం మంది ఉన్నారని, పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల లోపాన్ని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రత్యేక ఉపాధ్యాయులు కట్టా సరేష్ కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల కేంద్రంలో సోమవారం దివ్యాంగుల పిల్లలు, అభ్యసన సమస్యలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్కే బాలఈశ్వరయ్య మాట్లాడుతూ చదవడం, రాయడం, భాషను వ్యక్తం చేయడం, లెక్కలు తదితర సమస్యలు కలిగి ఉంటారని, చిన్న వయస్సులోనే ఆయా సమస్యలను గుర్తించి వారికి మంచి శిక్షణ అందిస్తే రాణిస్తారని తెలిపారు. భవిత సెంటర్‌లో లోపాలు కలిగిన పిల్లలు, వారికి అందుతున్న సంక్షేమాలు, అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి మాట్లాడారు. ఎం.చంద్రకుమారి, కె.కుమారి, అంగన్‌వాడీ టీచర్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం

నరసాపురం: పట్టణంలో సోమవారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దపదపాలుగా పడిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగి పొర్లాయి. దీంతో పట్టణంలో ప్రధాన సెంటర్‌లో మోకాలు లోతు నీరు చేరింది. బస్టాండ్, స్టీమర్‌రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మృతుల కుటుంబాలకు రఘురామ్ పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో పెదతాడేపల్లి, కడియద్ద గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు పోతుల అన్నవరం, యాతం కోటీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండపల్లి బుజ్జిలను సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్‌నాయుడు పరామర్శించారు. ఇటీవల అన్నవరం తల్లి వెంకాయమ్మ, కోటీశ్వరి తల్లి గంగారత్నం, బుజ్జి తండ్రి భాస్కరరావు మృతి చెందారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటికి పెద్దలు మృతి చెందితే ఆ బాధ తీర్చలేనిదని ఓదార్చారు. తొలుత వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి



కడియద్ద గ్రామంలో సర్పంచ్ యాతం కోటీశ్వరిని పరామర్శిస్తున్న వడ్డి రఘురామ్‌నాయుడు

శేషులత, సర్పంచ్‌లు రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఎలిపే గాంధీ, ఎమ్పీటీసీలు నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, నాయకులు కొండుబోయిన కృపావరం, యాతం బూరయ్య తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే జ్వరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో సోమవారం నిర్వహించిన ఫీవర్ సర్వే, మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, కీటకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దోమకాటుతో వచ్చే డెంగీ, చికెన్‌గున్యా, డయేరియా, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులబారిన పడకుండా ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నపాటి నీటి నిల్వలే దోమలకు ఆవాసాలని, వారానికోసారి నీటి నిల్వలను తొలగింపజేసుకోవాలని కోరారు.



తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా ఆరోగ్య జాగ్రత్తలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ అపరాల మార్కెట్ శాఖ 8వ మహాసభ సోమవారం స్థానిక సీతారాంపేట చుక్కా అప్పలస్వామి భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక సమస్యలపై ఉద్యమించాలన్నారు. కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీనులు మాట్లాడుతూ రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సరఫరా, ఆస్తి పన్ను, నీటి



మహాసభలో సీపీఎం నాయకులు

పన్నులు మీద ఆందోళన చేయాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన శాఖ కార్యదర్శిగా పోతు శ్రీను ఎన్నికయ్యారు. కార్మికులు పాల్గొన్నారు.

ముంపులోనే ప్రభుత్వ కళాశాల

తణుకు టౌన్: తణుకు పట్టణంలోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కురుస్తున్న భారీ వర్షాలకు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఆ నీటిలోనే తరగతి గదులకు వెళ్లారు. దసరా సెలవుల కారణంగా గత వారం రోజులుగా కళాశాల తెరుచుకోకపోవడం, సిబ్బందికి కూడా సెలవులు కావడంతో గత వారం రోజులుగా కురిసిన వర్షపు నీరు కళాశాల ఆవరణలోనే నిలిచిపోయింది. కళాశాల చుట్టూ డ్రెయినేజీలు ఎత్తుగా ఉండటంతో కళాశాల ఆవరణ, తరగతి గదులు పల్లమైపోయాయి. దీనితో కొద్దిపాటి వర్షం కురిసిన బయటకు వెళ్లకుండా ఆవరణలోనే నిలిచిపోతుంది. దీనితో కళాశాల యాజమాన్యం ఆయిల్ ఇంజన్ల ద్వారా మురుగునీటిని బయటకు తోడుతున్నారు. అయితే ఆయిల్ ఇంజన్‌ల ద్వారా మురుగునీటిని బయటకు పంపించడం ఖర్చుతో కూడుకున్నది కావడంతో కళాశాలకు భారంగా మారింది. ప్రభుత్వ కళాశాలలోని మురుగునీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కళాశాల కమిటీ కోరినా ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కళాశాల ఆవరణలోని మురుగునీటి మధ్యనే విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష కాలంలో వర్షపు నీటి ముంపు నుంచి విద్యార్థుల చదువులు కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీరు

వరద ఖర్చుల అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముంచెత్తిన వరదల సందర్భంగా ప్రభుత్వం చెబుతున్న వరద ఖర్చులు చూస్తే అవినీతి భారీ స్థాయిలో జరిగినట్లు అర్థమవుతుందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు మామిడి దాన వర ప్రసాద్ అన్నారు. పట్టణంలో న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. దాన వర ప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం ప్రజలు, ప్రముఖులు భారీగా విరాళాలు ఇచ్చారన్నారు. ప్రభుత్వం కూడా రూ.500 కోట్లు వచ్చాయని చెప్పడం జరిగిందని వెల్లడించారు. అయితే వరద బాధితలకు ప్రభుత్వం తరుపున రూ. 368 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారన్నారు. వరద పరిహారాలు వచ్చేసరికి లక్ష లోపు కుటుంబాలే ఎందుకు నమోదు చేశారని మిగిలిన లక్షన్నర కుటుంబాలు ఏమైపోయాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అక్టోబర్ 14న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ధర్నాలు చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందని, విజయవంతం చేయాలన్నారు.

ఓబీసీ సమస్యపై కేంద్ర మంత్రికి వినతి పత్రం

పాలకొల్లు సెంట్రల్: తూర్పుకాపులను ఒక ప్రాంతంలో బీసీలుగా, మరో ప్రాంతంలో ఓబీసీలుగా గుర్తిస్తున్నారని తూర్పుకాపులు ఎక్కడున్నా ఓబీసీలుగా గుర్తించాలంటూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు తూర్పుకాపు సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. సోమవారం భీమవరంలోని మంత్రి కార్యాలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తూర్పుకాపు సంఘ నాయకులు మాట్లాడుతూ దీనిపై పార్లమెంటులో బిల్లు ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర అని లేకుండా తూర్పుకాపులకు ఓబీసీ ఫలాలు అందేలా కృషి చేయాలని కోరామన్నారు.



కేంద్ర మంత్రి వర్మకు వినతిపత్రం అందజేస్తున్న తూర్పు కాపు సంఘ నాయకులు

గ్రామాల అభివృద్ధికి చర్యలు

అత్తిలి: గ్రామ దర్శిని-పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలలో అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం చేపట్టిందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో ప్రారంభించిన గ్రామ దర్శిని, పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం కోసం ప్రణాళిక సిద్ధం చేస్తారన్నారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, మినీ గోకులం నిర్మాణాలకు ఎమ్మెల్యే రాధాకృష్ణ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఎంపీపీ సుంకరనాగేశ్వరరావు , టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ,మెంతు రాజ్‌కుమార్, కడలి శ్రీనివాసరావు, పార్వతి, సుశీ ల, తాతారావు, సత్తిబాబు, మురళి, శ్రీను, వనేశం, ఎంపీడీవో పి శామ్యూల్, తహసీల్దార్ వంశీ పాల్గొన్నారు.



కె సముద్రపుగట్టులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

ఎటు వెళ్దామన్నా..సాహసయానమే!

- వర్షాలకు ఛిద్రమైన రహదారులు
- అడుగుకో గొయ్యి... అవస్థలు పడుతున్న వాహనదారులు
- అధిక శాతం మరమ్మతులకే ఖర్చు
- త్వరితగతిన రహదారులు నిర్మించాలంటున్న వాహనదారులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా దండగర్ర - జగన్నాథపురం, దండగర్ర - మాధవరం, ఉప్పరగూడెం - మోదుగ గుంట, పెదతాడేపల్లి - జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం, మాధవరం - కంసాలిపాలెం రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయి. అప్పటికే ఏర్పడిన గోతులకు తోడు ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఆ గోతుల్లోకి నీరు చేరింది. దీంతో చిన్నపాటి గుంతలు సైతం పెద్దవిగా మారాయి. అంతే కాకుండా రహదారులపై మెటల్ చిప్స్ లేచి ఛిద్రంగా తయారయ్యాయి. పగటి మాట ఎలా ఉన్నా రాత్రి సమయాల్లో ఈ రహదారులపై ప్రయాణించాలంటే భయమేస్తుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారులపై ప్రయాణం గంటల తరబడి సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలని కోరుతున్నారు.



తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట - మాధవారం రహదారి దుస్థితి



మెట్ట ఉప్పరగూడెం - దండగర్ర రహదారి

వాహనాలు మరమ్మతులకు వస్తున్నాయి



రహదారులపై గోతులు కారణంగా వాహనాల కమాన్ కట్టలు విరిగిపోతున్నాయి. దీంతో వాహనాలకు అత్యధిక పెట్టుబడులు పెట్టవలసి వస్తుంది. లోడు వాహనాలతో మరింత ఇబ్బందిగా మారింది. సకాలంలో గమ్యానికి చేరుకోలేకపోతున్నాం. రహదారులను వెంటనే బాగు చేయించాలి. – ఏలూరి రాజేష్, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం

ఒళ్లు హూనమవుతోంది



గోతులమయంగా మారిన రహదారులపై ప్రయాణం చేయడం వల్ల ఒళ్లు హూనమవుతోంది. దూరాభారంకాకపోయినా వాహనాలపై వెళ్లాలంటే భయమేస్తుంది. ద్విచక్ర వాహనాలైతే రహదారిపై ఏర్పడిన గోతుల్లో పడి పైకి రాలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులు నిర్మించాలి.

– జిల్లా లక్ష్మణ స్వామి, మాధవరం, తాడేపల్లిగూడెం మండలం